క్లుప్తంగా

రెండు పూటలా పనిచేస్తేనే మస్టర్

- ఏపీఓ రామకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీఓ రామకృష్ణ

సాలూరు రూరల్: మండలంలోని ఉపాధిహామీ కూలీలు రెండుపూటలా పనిచేయాలని ఒక పూట పనిచేసి రెండోపూట రాని కూలీలకు మస్టర్ వేయడం కుదరదని ఏపీఓ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పనులు మండలంలోని 29 పంచాయతీల్లో జరుగుతున్నాయన్నారు. అయితే ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తప్పనిసరిగా కూలీలు పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అంతేకాకుండా కూలీలు రాకుండా మస్టర్ వేసినట్లు తెలిస్తే ఫీల్డ్అసిస్టెంట్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్లెక్సీల తొలగింపు



కవిరిపల్లిలో మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం

మక్కువ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన రాజకీయనాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. ఎంపీడీవో డి.డి స్వరూపరాణి ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి ఫ్లెక్సీలను తొలగింపజేశారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాల ముఖాలు బయటకు కనిపించకుండా కప్పివేశారు.

వేడుకగా శ్యామలాంబ అమ్మవారి ఘటాల ఊరేగింపు

సాలూరు: పట్టణంలో వెలసిన శ్యామలాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో ఘటాల ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. శాస్త్రోక్తంగా మంగళవాయిదాల నడుమ ఘటాలతో వచ్చిన అమ్మవారిని భక్తులు పట్టువస్త్రాలు, పుష్పాలతో స్వాగతించారు. అధిక సంఖ్యలో భక్తులతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి పాల్గొన్నారు.

వెంగళరాయ సాగర్‌లో చేపల విడుదల



చేపలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ అధికారులు, సంఘం సభ్యులు

సాలూరు రూరల్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన 2020-2021 లో భాగంగా వెంగళరాయ సాగర్ జలాశయం పరిధి చినచీపురువలసలో 5.94 లక్షల చేపపిల్లలను మండల రెవెన్యూ అధికారి ఎన్.వెంకటరమణ మత్స్యశాఖ అధికారి వై. శ్రీదేవి సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ అధికారి బి.అప్పన్న, మత్స్యశాఖ కమిటీ అధ్యక్షుడు సురపాటి ఆదినారాయణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పార్వతీపురం నుంచి అరసవల్లికి ప్రత్యేక బస్సులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి శ్రీకాకుళం జిల్లా అరసవిల్లికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం పట్టణ భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు వీలుగా రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అరసవిల్లికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సులన్నీ సాధారణ చార్జీలతోనే నడుపుతున్నట్లు చెప్పారు. భక్తులు ఈ ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా సామూహిక అక్షరభ్యాసం



సామూహిక అక్షరభ్యాసం జరుగుతున్న దృశ్యం

సీతానగరం: వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం గెద్దలుప్పి జంక్షన్‌లో గల సర్వతీ దేవి విగ్రహం ఆవరణలో సామూహిక అక్షరభ్యాస కార్యక్రమం ఆగమ వేదపండితులు బైరి వేణు శాస్త్రి పర్యవేక్షణలో జరిగింది. ఈ మేరకు వేదపండితుడు మాట్లాడుతూ ఏటా వసంతపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి పరిసర గ్రామాలనుంచి పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు వచ్చి అక్షరాభ్యాసం చేయిస్తారన్నారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..!



విక్రయానికి పెట్టిన వ్యవసాయ పనిముట్లు

- జిల్లాకు వచ్చేసిన వలస జీవులు
- వ్యవసాయ పనిముట్ల విక్రయానికి ఊరూరా సంచారం
- రోడ్ల పక్కనే గుడారం, వస్తువుల తయారీ
- మధ్యప్రదేశ్ వాసుల జీవన గమనం



తయారీలో సహకరిస్తున్న మహిళ

బలిజిపేట:

జీవనోపాధి కోసం శ్రమజీవులు రాష్ట్రాలు దాటి వలసబాట పట్టి వస్తున్నారు. బతుకు తెరువుకు గ్రామాలకు వస్తూ వ్యవసాయ పనిముట్లు, వంటింటి పాత్రలు తయారుచేసి వారి జీవనం గడుపుతున్నారు. ఆకలికి రుచి తెలియదు, నిద్ర సుఖమెరగదు అన్న సామెత వారి జీవితాల్లో నిజంగా కనిపిస్తుంది. కనీసం నిలువ నీడలేని ఈ కుటుంబాలు పగటిపూట చెట్టు నీడ, తెరచాటు నీడలే వారికి అండ. రాత్రి సమయంలో ఖాళీ ప్రదేశాలు వారి ఆవాసాలు. కిలోమీటర్ల దూరం ప్రయాణించి, కనిపించిన పల్లెల్లో పనిముట్లు తయారుచేసి వాటిని విక్రయించి జీవనం సాగిస్తున్నారు మధ్యప్రదేశ్ వాసులు. వ్యవసాయ పనుల్లో నిత్యం వినియోగించే గొడ్డలి, కత్తి, గునపం తదితర పనిముట్లతో పాటు గృహ వినియోగాలైన కత్తిపీటలను తయారు చేస్తుంటారు. వందలాది కుటుంబాలు పట్టణ ప్రాంతానికి చేరి అక్కడి నుంచి పల్లె ప్రాంతాలకు వలసబాట పట్టి ఒక్కో పల్లెలో రెండు లేదా మూడు రోజులు ఉండి పరికరాలను తయారుచేసి విక్రయిస్తుంటారు. వారు రహదారుల పక్కనే తాత్కాలిక నివాసముంటే అక్కడే వ్యవసాయ పరికరాలను తయారుచేసి విక్రయిస్తారు. డిమాండ్‌ను బట్టి రెండు, మూడు రోజులు ఉంటారు. ఆ తర్వాత మరో గ్రామానికి వలసబాట పడతారు.



తెరచాటున పిల్లలను లాలిస్తున్న మహిళ

కళ్లెదుటే చేస్తూ:

వారితో తీసుకువచ్చిన ఇనుప రాడ్లను రైతుల ముందే కొలిమిలో కాల్చి వారు కోరిన విధంగా పనిముట్లను తయారుచేయడం మధ్యప్రదేశ్ వాసుల ప్రత్యేకత. ఒక్కో పనిముట్టును దాని బరువు ఆధారంగా రూ.200నుంచి రూ.1000వరకు విక్రయిస్తుంటారు. ఇలాంటి పనిముట్లు స్థానికంగా దుకాణాల్లోనూ లభిస్తాయి. కానీ వాటి నాణ్యత కంటే వీటి నాణ్యత ఎక్కువగా ఉంటుందంటూ రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. తమ కళ్ల ఎదుటే మంచి, నాణ్యమైన ఇనుప రాడ్లతో తయారుచేసిన వాటిని కొనుగోలు చేస్తారు.

చదువుకు పిల్లలు దూరం:

తల్లిదండ్రులతో పాటే వలస జీవితం సాగించే చిన్నారులు పూర్తిగా చదువుకు దూరమవుతున్నారు. పదేళ్ల వయస్సు వారు సైతం సమ్మెట దెబ్బలు వేస్తూ తల్లిదండ్రులకు సహాయం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లడం లేదు.

జీవనోపాధికి వస్తుంటాం



“ జీవనోపాధి కోసం ఏటా ఇలా వలస వచ్చేస్తాం. ఒక్కో గ్రామంలో తిరుగుతూ పరికరాలు తయారుచేసి విక్రయిస్తుంటాం. ఇనుము రద్దు అమ్మే వారినుం,ఇ కొనుగోలు చేసి పరికరాలు తయారుచేస్తాం. జీవనోపాధికి ఇది తప్పదు.

– బీదులోహరు, మధ్యప్రదేశ్

వలస బాట

మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వారంతా ఏడాదిలో దాదాపు పది నెలల పాటు బయిట రాష్ట్రాల్లో తిరుగుతారు. ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లోని పలు గ్రామాల్లో జీవనం సాగిస్తారు. అక్కడి రైతులకు కావల్సిన వ్యవసాయ పరికరాలను తయారుచేసి విక్రయిస్తారు. ప్రస్తుతం వీరు నవంబర్ నెల నుండి ఎక్కువగా గ్రామాల్లో కనిపిస్తుంటారు. పరికరం తయారీ సమయంలో మగవారితో పాటు మహిళలు చెమటోడ్చి వారికి సహకరిస్తారు. ఇనుమును కొలిమిమీద మండించడం, దానికి కావాల్సిన ఆకారాలు వచ్చేందుకు సమ్మెట దెబ్బలు కొట్టడంలో మహిళలు సాయంగా ఉంటున్నారు. ఇదేకాక వారికి పిల్లలు ఉంటే వారి తిండి, నిద్ర సమయాలలో వారికి సేవలు అందిస్తారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు



అన్నంరాజువలస సచివాలయంలో 11.20గంటలకు ఉద్యోగులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సాలూరు రూరల్: మండలంలోని అన్నంరాజువలస సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. సోమవారం సచివాలయం తలుపులు తీసిఉన్నప్పటికీ కార్యాలయంలో ఉద్యోగులు లేకపోవడంతో కుల ధ్రువీకరణ పత్రం కోసం అదే గ్రామానికి చెందిన చుక్క లక్ష్మి నిరీక్షించడం కనిపించింది. 11.20 గంటలకు వ్యవసాయ సహయ అధికారి విధులకు చేరుకున్నారు. అప్పటికి మిగతా ఉద్యోగులు రాకపోవడంతో పనుల కోసం వచ్చిన వారంతా వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోందని వారంలో కొన్ని రోజులు సచివాలయ ఉద్యోగులు ఇలాగే సమయ పాలన పాటించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి సచివాలయ వ్యవస్థపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా సచివాలయ ఉద్యోగుల సమయ పాలనపై ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపమే ఈ నిర్లక్ష్యమే ఉదాహరణగా చెప్పవచ్చు.

దళితులపై దాడిచేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదుచేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు తదితరులు

సాలూరు: మండలంలోని కరాసవలస దళితులపై పట్టణానికి చెందిన వ్యాపారి సుతాపల్లి రాము దాడిచేయించి కొట్టించారని నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేయాలని పలువురు ఆదివాసీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివాసీ సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావులు మాట్లాడుతూ, కరాసవలస దళితులు సాగుచేస్తున్న భూములను కాజేయాలనే దురుద్దేశంతో గుర్రపువలస గ్రామ గిరిజనులను దళితులపై రాము ఎగదోసి దాడి చేయించి కొట్టించారని ఆరోపించారు. రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేయాలని, దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనుల మధ్య తగాదాలు సృష్టించి భూములను కాజేయాలని కుట్రపన్నుతున్నారన్నారు. రాముకు రాజకీయ అధికార అండదండలు ఉండడం వల్ల ఈ విధంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రాము భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని, సాగులో ఉన్న దళితులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, జానకిరావు, చలం, సింహాచలం, తులసమ్మ, నవీన్, రాము, బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి యువతకు చేయూత ఇవ్వాలి



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి తోట జీవన్న

పార్వతీపురంటౌన్: ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి ఎస్సీ నిరుద్యోగ యువతకు చేయూత నిచ్చే విధంగా రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. ఎస్సీ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని ఈ మేరకు ఎమ్మెల్యే విజయ చంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన ముందు ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేసి ఆదుకునేదన్నారు. ఆ రుణ సాయంతో ఎస్సీ నిరుద్యోగ యువత చిన్న, చిన్న వ్యాపారాలను చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకునేవారన్నారు. విభజన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో కార్పొరేషన్ ద్వారా రావాల్సిన రుణాలు రాకపోవడంతో లక్షలాదిగా ఉన్న ఎస్సీ నిరుద్యోగ యువత నిరుత్సాహానికి గురవుతున్నారన్నారు. దళితులకు ఉన్న కొద్దిపాటి పథకాలను రద్దు చేయడంతో దళితుల సంక్షేమం పోయిందనిని, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా దళిత పేదలు మౌలిక సదుపాయాలకు దూరంగా ఉంటున్నారన్నారు. ఎస్సీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు కాకపోవడం వల్ల దళితులపై దాడులు నిత్య కృత్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు, బీటీ నాయుడు, గుజ్జుల జనార్దన, బొత్స మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులున్న వారంతా ఉపాధి పనుల్లో పాల్గొనాలి



వేతన దారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులున్న వేతన దారులందరూ పనుల్లో పాల్గొవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు నిడగల్లులో సోమవారం ఉపాధి పనుల్లో పాల్గొన్న వేతనదారుల మస్తరు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులున్న వేతనదారులకు 100 రోజుల పనిదినాలు కల్పించాలన్న సంకల్పంతో వేతన దారులందరూ ఉపాధి పనుల్లో పాల్గొవాలని కోరారు. అలాగే నిడగల్లులో 107 మంది వేతన దారులు పనుల్లో పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో జాబ్ కార్డులున్న వేతన దారులందరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా మేట్‌లు, టెక్నికల్ సహాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపవద్దు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏఎంవీఐ సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: మద్యం తాగి వాహనాలు నడపరాదని జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలు 2025లో భాగంగా సోమవారం స్థానిక సురేష్ స్కూల్‌లో సుమారు 210 మంది స్కూల్ విద్యార్థులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాన్ని నడిపే వ్యక్తి తప్పని సరిగా ఐఎస్ఐ మార్క్ కలిగిన హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, అందుకు భారీ జరిమానాతో పాటు మూడు నెలలు డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేసే అవకాశం ఉందన్నారు. ఓవర్ స్పీడ్‌తో వాహనం నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. పరిమితికి మించి అధికంగా ప్రయాణికులతో వాహనం నడపరాదని సూచించారు. ప్రతి వాహనదారు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రతకు సంబంధించి మాక్ టెస్ట్, క్విజ్ పోటీని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ జి.సత్యనారాయణ, ఎ.వరప్రసాద్, మెడికల్ ఆఫీసర్ పి.నారాయణరావు, సురేష్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అధ్యాపకుడి మృతి



మృతుడు శ్రీనివాసరావు (ఫైల్)

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస ఏపీటీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు సోమవారం ఉదయం కళాశాలకు బయలుదేరే క్రమంలో ఇంటివద్ద గుండెపోటుకు గురై మతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు శ్రీనివాసరావు ఇంటికి వచ్చి ఆయన మృతి పట్ల సంతాపం వెలిబుచ్చారు.

ఉపాధి పనుల పిటిషన్‌పై హైకోర్టు తీర్పు..?

- హైకోర్టును ఆశ్రయించిన సర్పంచ్‌లు

సాలూరు: ఉపాధిహామీ చట్టానికి తూట్లు పొడుస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా పనులు చేపట్టడంపై హైకోర్టులో దాఖలైన రిట్‌పిటిషన్‌పై, ధర్మాసనం ఉపాధిపనులు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలియవస్తోంది. సాలూరు మండలంలో ఉపాధి హామీ పనులు నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపడుతున్నారని శివరాంపురం, పెదపధం, పారన్నవలస పంచాయతీల సర్పంచ్‌లు హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. ఉపాధిహామీ చట్టంలో గ్రామ పంచాయతీలకు కల్పించిన హక్కులు, ప్రయోజనాలను విస్మరిస్తూ కూటమి ప్రభుత్వం ఉపాధి పనులను వెండర్ పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో చేయించడం నిబంధనలకు విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధిపనులు ప్రారంభం కాకుండా తక్షణమే చూడాలని ప్రభుత్వం తరపున న్యాయవాదులను హైకోర్టు ఆదేశించినట్లు తెలియవస్తోంది. ఈ మేరకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చాయని, ఈ విషయం ఆ పనులను చేపట్టిన వెండర్లకు చేరవేసినట్లు సమాచారం. కాగా ఈ కేసులో నేడో, రేపో హైకోర్టు పూర్తిస్థాయిలో తీర్పు జారీ చేసే అవకాశం ఉందని న్యాయవాది రేగు మహేశ్వరరావు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో పాఠశాలలు ఎత్తి వేసేందుకు సిద్ధమైన కూటమి

పార్వతీపురం టౌన్: గిరిజన గ్రామాల్లో పాఠశాలలు ఎత్తి వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని గిరిజన సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక ఐటీడీఏ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలం గోచెక్క పంచాయతీ లిడికివలస, వెలగ వలస పంచాయతీ, వెలగవలస, మరికి పంచాయతీ కొత్తవూరు ప్రాథమిక పాఠశాలలు ఎత్తి వేయడానికి కూటమి ప్రభుత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇలా జిల్లాలో, గిరిజన ప్రాంతాల్లో అనేకం ఉన్నాయని, ఇదే జరిగితే గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్య దశలోనే డ్రాప్ అవుట్‌లుగా మారుతారన్నారు. ఈ నేపథ్యంలో ఇటువంటి నిర్ణయం కూటమి ప్రభుత్వం మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇటువంటి నిర్ణయాలు అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

కూటమి నాయకులు తీరు మార్చుకోవాలి

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి, తదితరులు

పాలకొండ:

కూటమి నాయకులు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. డివిజన్ కేంద్రంలో వీరు విలేకరులతో మాట్లాడుతూ.. సోమవారం నిర్వహించిన నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి నాయకులు హంగామా చేశారని మండిపడ్డారు. కనీస బలం లేక పోయినప్పటికి చైర్మన్ పదవి పొందేందుకు అడ్డదారుల్లో ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన వారిని తమ పార్టీ వారుగా చెప్పుకోవడం సరికాదన్నారు. నగర పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిపించాలని కోరారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో సోమవారం జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి పార్టీ ప్రతినిధులతో పార్టీని బలోపేతం చేసేందుకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతించిపోయిన విషయాన్ని పట్టించుకోవద్దని, పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటూ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా ముందుకు వెళ్లాల్సిన ఆవసం ఉందన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి అందుకు తగ్గట్టుగా మీరంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కలుస్తానని చెప్పారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పార్టీని ముందుకు నడిపించాలని, భవిష్యత్ మనదేనని నాయకులు గుర్తించుకుని ఎన్ని ఇబ్బందులు వచ్చినా కష్టాలు వచ్చినా వాటిని ఎదుర్కొని సహనంతో ముందుకు సాగాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఇప్పటికే పార్వతీపురం, బలిజిపేట మండలాల్లో జరిగిన సమావేశాలతో పాటు సీతానగరంలో సమావేశం విజయవంతం అవడం వల్ల పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ జిల్లా మండల నాయకులు బి.ముకుందరావు, డి.నాగరత్నం,ఆర్వీ పార్థసారథి, రాష్ట్ర విభిగంలో వివిధ స్థాయిల్లో నియమితులైన ప్రతినిధులు శివ, తవుడు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో సేవలందిస్తున్న నాయకులు పీఏ సీఎస్, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



నిరసన తెలుపుతున్న నాయకులు

సాలూరు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్రానికి సరిపడా బడ్జెట్ ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ సాలూరు కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు రాముడు, శంకరరావులు మాట్లాడుతూ, రాష్ట్రంలో విభజన చట్టం ప్రకారం మన్యం జిల్లాలో కేంద్రియ గిరిజన యూనివర్సిటీకి సరిపడా నిధులు నేటికీ లేవని, స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం మన్యం జిల్లా మెడికల్ కాలేజీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ తదితర నిధులేమి లేవని విమర్శించారు. వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకులు ధరలు తగ్గించి, రాష్ట్రానికి మేలు చేసే విధంగా నిధుల కేటాయింపు చేయాలని, లేకుంటే భవిష్యత్‌లో ప్రజలందరితో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రవి, మధు, పోలరాజు తదితరులు పాల్గొన్నారు.